అన్నాడు: "నరులు, సురలు, యక్షులు, కిన్నరులు, కింపురుషులు, గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు ఎవరూ దీన్ని ఎక్కు-పెట్టలేరు. ఇక మానవుడు దీనివేపు చూడనైనా గలరా?" అంటూ మళ్ళీ విశ్వామిత్రుడి కేసి పరమ వినీతుడై చూస్తూ- "ముల్లోకాలలో ఈ విల్లును ఎక్కు-పెట్టే సమర్థుడే లేడే- మీ మాట ఎలాగ కాదనడమని ఇంత ప్రయత్నం మీద తెప్పించాను. చూదామని వచ్చారుకదా! మీ రాజకుమారులకు చూపండి" అని విన్నవించుకొన్నాడు జనక మహారాజు.

విశ్వామిత్రుడికి అణచుకోలేని నవ్వువస్తున్నది. "రామభద్రా! చూడు మరి" - అన్నాడాయన. పైన ఉన్న మూతను నెమ్మదిగా ఎత్తాడు రామచంద్రుడు. "మునికులతిలకా! మీ ఆజ్ఞ అయితే దీన్ని పైకితీసి, అల్లెతాడు బంధిస్తాను" అన్నాడు విశ్వామిత్రుల వారితో. జనక మహా రాజు కూడా తలవూపి సంతోషంగా చూశారు రామచంద్రుణ్ణి. ఆ నీల మేఘశ్యాముడు, కాకపక్షధరుడు అవలీలగా ఇట్టే ఆ విల్లును ఎత్తి పట్టు కున్నాడు. మహర్షులు, రాజబంధువులు, జనక మహారాజు యాగానికి వచ్చిన ఎందరో రాజులు, రాజకుమారులు ఎంతో ఆశ్చర్యపోయారు. రాముడు అల్లె తాటిని చెవిదాకా లాగి విడిచిపెట్టాడు. మదపుటేనుగు తొండందెబ్బకు చెరుకుగడ విరిగినట్లుగా ఆ విల్లు కాస్తా విరిగి పోయింది. అయితే అప్పుడు పుట్టిన ప్రళయ భీకరమైన శబ్దానికి అక్క-డున్న వాళ్ళ ఒళ్ళు జలదరించింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. చెవులు దిబ్బెడలు పడిపోయినాయి. ఒక్క- విశ్వామిత్రుడు, జనకమహారాజు, రామలక్ష్మణులు తప్ప తక్కిన అందరూ చొక్కు- జల్లినట్లు దిగ్భ్రాంతి చెందారు. చాలాసేపటికి వాళ్ళంతా తేరుకున్నారు.

ఇక అప్పుడు పట్టజాలని సంతోష తమకంతో జనకమహారాజు అన్నాడు గదా - "ఓ మహర్షీ! నా పాలిటిదైవానివయ్యా నీవు. నా తల్లి సీత వీర్యశుల్క- అని నేను ప్రతిజ్ఞ చేశాను. ఆ ప్రతిజ్ఞ నీ వల్ల నేటికి

నెరవేర్చుకో గలిగాను, మహానుభావా! మా సీతను రాఘవుడికిస్తాను" అని నోట్లో మాట నోట్లో ఉంటూ ఉండగానే "మంత్రులతో దశరథ మహారాజుకు కబురుచేస్తాను. మీ అనుజ్ఞకోసం వేడుకుంటున్నాను" అని విశ్వామిత్రుల వారికి జనకుడు విన్నవించుకున్నాడు. శుభస్య శీఘ్రం అని చాలా సంతోషపడ్డారు విశ్వామిత్ర మహర్షి. బంగారు రేకుమీద శుభలేఖ తయారైంది. రామలక్ష్మణులు మిథిల చేరిన మంగళ వర్తమానం, విశ్వామిత్రుల వారి కుశలం, శివుని విల్లు దాశరథి ఎక్కుపెట్టగానే విరిగిన సంగతి - అన్నీ దశరథ మహారాజు వారికి వినిపించి, మీరు వెంట ఉండి వారిని తీసుకుని హుటాహుటి ఆగమేఘాల మీద రావాలి అని మంత్రులకు చెప్పాడు జనకమహారాజు. వాయువేగ జవం గల గుర్రాల మీద మూడు రోజులు ప్రయాణం చేసి అయోధ్య చేరారు జనకుడు పంపిన మంత్రులు. "విశ్వామిత్ర మహర్షి ఆజ్ఞాపనచే మేమీ శుభ వర్తమానం మీకు చెబుతున్నాం. మహారాజా! మా జనక మహారాజు సాంజలియై మీకి విధంగా చెప్పి పంపారు మమ్మల్ని" అని మిథిలలో జరిగిన యావత్తు సంగతులు వినిపించారు మంత్రులు.

దశరథ మహారాజు సంతోషం అంతా ఇంతా కాదు. వసిష్ఠుల వారికి, వామదేవుడికి నమస్కరించి, మంత్రులను పిలిచి ఉన్నపళంగా బయలుదేరమన్నాడు దశరథ మహారాజు. ఆ తెల్లవారుజామున అంతా బయలుదేరారు. జనకుడి మంత్రులు కూడా ఉన్నారు. వశిష్ఠులవారు, వామదేవుడు, జాబాలి, కశ్యపులవారు, కాత్యాయన మహర్షి, మార్కండేయులవారు ముందు ఉన్నారు. చతురంగ బలాలు, అంతులేని ధన కనకవస్తువాహనాలతో, అయోధ్య నగరమంతా కదిలిందా ఏమిటన్నట్లు పెళ్ళివారు బయలుదేరారు. మిథిల చేరడానికి నాలుగు రోజులు పట్టింది మగపెళ్ళివారికి.

జనకమహారాజు ఎదురొచ్చి "ఓహో ఏమి నా భాగ్య"మని పొంగి పోయినాడు. "ఇంద్రుడి చుట్టూ దేవతలు కొలిచి ఉన్నట్లుగా కళ్ళ పండుపుగా వసిష్ఠులవారు నా నగరానికి విచ్చేయడమా! నా జన్మ సార్థకమై పోయింది. నా బిడ్డ లోకోత్తరమైన అదృష్టవంతురాలు" అని మగపెళ్ళి వారిని గౌరవించాడు జనకమహారాజు. దశరథ మహారాజుతో ఆయన అన్నాడూ-"ఇక నేను మీ చెప్పుచేతలలోనివాణ్ణి. అంతా మీరే చూసుకోవాలి. ఇక ముందు పనులన్నీ మీ రెట్లా చెపితే అట్లా జరుగుతవి." అప్పుడు దశరథుల వారన్నారూ-"ఇది చాలా బాగుంది. పుచ్చుకునేవాడు ఇచ్చుకునేవాడి దగ్గర చేతులు కట్టుకుని నిలబడతాడు. అయ్యా! మీ ఆజ్ఞ ఎలాగుంటే అలా నడచుకునేవాణ్ణి నేను. మేం స్వతంత్రులం కాం. మీ అధీనులం ఇకనుంచీ." ఈ మాటలు విని అందరూ నవ్వుకున్నారు.

జనకమహారాజుకి తన తమ్ము డప్పుడు తన ప్రక్కనే లేక పోవడం కష్టమనిపించింది. "ఇక్షుమతీ నదీతీరాన సాంకాశ్యపురంలో ఉన్న నా తమ్ముడు కుశధ్వజుడు రాకుండా సీత పెళ్ళి ఎట్లానయ్యా నేను చేసేది?" అని శతానందుల వారిని తమ్ముణ్ణి వెంటనే మిథిలకు తీసుకుని రమ్మని కోరాడు జనక మహారాజు. శతానందుల వారా ఏర్పాటు క్షణంలో చేశారు. ఇలా పెళ్ళి దూతలు అలా కుశధ్వజుణ్ణి కుటుంబ పరివార సమేతంగా మిథిలకు తీసుకునివచ్చి జనకమహారాజుకు చాలా సంతోషం కలిగించారు.

కళ్యాణమంటపానికి దశరథ మహారాజుని, ఆయన ఇల్లాళ్ళను, పెళ్ళి కొడుకును తీసుకుని రావలసిందని జనకమహారాజు సుధామను డనే మంత్రిని పంపించాడు. దశరథుడు అందరితోనూ కలిసి వచ్చాడు. మా వసిష్ఠుల వారు మా వంశక్రమమంతా చెబుతారు. ఈయన మా కులదైవం అన్నారు దశరథ మహారాజు. సృష్టికాద్యుడు బ్రహ్మదేవుడు.

ఆయన మానస పుత్రుడు మరీచి. ఆయనకు కశ్యపుడు పుట్టాడు. ఆయనకు సూర్యుడు. సూర్యుడికి వైనస్వతుడనే మనువు పుట్టాడు. మనువుకు ఇక్ష్వాకు మహారాజు అని వంశవృక్షమంతా వినిపించి అజమహారాజుకు దశరథుడు, దశరథుని నలుగురు కొడుకుల వద్దకు చేరుకున్నారు వసిష్ఠుల వారు. ఇంకా ఇలా అన్నారాయన-నీ రెండో కూతురు ఊర్మిళను మా లక్ష్మణుడి కీయవయ్యా అని. జనకుడు కొండ ఎక్కినంత సంబర పడ్డాడు. కన్యాదాతగా నా వంశక్రమం తెలియజేసుకుంటాను చిత్తగించండి అని జనకుడు తమ వృత్తాంతమంతా వినిపించాడు. మా మూలపురుషుడు నిమి. ఆయన కుమారుడు మహాపరాక్రమవంతుడు మిథి. ఆయనకు మొదటి జనక మహారాజు. ఆయనకు యుపదాసుడు. ఆయనకు నందివర్ధనుడు. ఆయనకు రాజర్షియైన దేవరాతుడు జన్మించాడు అని ఈ విధంగా వంశవృక్షం వర్ణించుకుంటూ వచ్చి, సాధు పోషకుడైన హ్రస్వరోముడనే మహారాజుకు నేను, నా తమ్ముడు కుశధ్వజుడు జన్మించాం అని జనకుడు చెప్పి, సాంకాశ్య పురం పరిపాలించే సుధన్వుడు శివకార్ముకంతో సీత నిస్తావా, లేదా అని నా పైన యుద్ధానికి వచ్చాడు. అప్పుడతణ్ణి వధించి సాంకాశ్యానికి నా తమ్ముణ్ణి రాజును చేశాను అని చెప్పాడు. ఆయన ఇలా తమ వృత్తాంతం చెబుతూ ఉండగా వసిష్ఠుల వారూ, విశ్వామిత్రుల వారూ లేచి, అవునయ్యా జనకమహారాజా! మీ తమ్ముడికి ఇద్దరు కూతుళ్ళున్నారు కదా! వాళ్ళను మా భరత శత్రుఘ్నుల కివ్వకూడదా? అని అడిగారు. అంతకన్నానా మహాప్రభూ, రఘువంశంతో మేం వియ్యమంది పవిత్రులమయ్యాము. నలుగురికీ ఒకేసారి పెళ్ళిచేదాం అన్నాడు జనకమహారాజు.

శుభముహూర్తాన మధ్యనున్న తెర తీయగానే రాముడూ, సీతా ఒకరి నొకరు చూసుకున్నారు. ఆ మోహనాంగి పరవశించి పోయింది. చంద్రుని చూసిన కలువ పూలే అయిపోయినాయి జానకి ముగ్ధనయ

